క్లుప్తంగా

పార్టీ నాయకుడి మృతదేహానికి చైతన్య నివాళి



దేవదాసు మృతదేహానికి నివాళులర్పిస్తున్న కృష్ణచైతన్య

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని రావి నూతల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కొలకలూరి దేవదాసు సోమవారం మృతి చెందారు. దేవదాసు భౌతికకాయానికి శాప్‌నెట్ చైర్మన్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్య పూలమాల వేసి నివాళులర్పించారు. దేవదాసు కుటుంబ సభ్యులను ఓదార్చారి ఆర్థిక సాయాన్ని అందజేశారు. నివాళులర్పించిన వారిలో సర్పంచ్ విజయవాణి, మాజీ ఎంపీపీ రాధాకృష్ణమూర్తి, సాధినేని మస్తాన్‌రావు, నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాల కూల్చివేతకు సిద్ధం



అక్రమ కట్టడం దారులతో మాట్లాడుతున్న అధికారులు

అద్దంకి రూరల్: స్థానిక ఎన్టీఆర్ నగర్‌లోని 18 సెంట్ల ప్రభుత్వభూమిని ఆక్రమించుకుని అక్రమ కట్టడాలు నిర్మించటంపై హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఆ కట్టడాలను కూల్చివేసేందుకు సోమవారం మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. కూల్చేందుకు చర్యలు తీసుకునే క్రమంలో యజమానులు ఒక రోజు గడువు కోరటంతో పనులు నిలుపుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి. రవికుమార్, టీపీఎస్ నారాయణరావు, అద్దంకి సీఐ ఎం. రోశయ్య, ఎస్సైలు ఆదిలక్ష్మీ, వెంకటేశ్వర్లు, తిరుపతిరావు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రంలో ఈ-క్రాప్ నమోదు



రైతులకు ఈ-కేవైసీ చేస్తున్న సిబ్బంది

జే.పంగులూరు: మండల పరిధిలోని రేణింగవరం రైతుభరోసా కేంద్రంలో సోమవారం ఈ-క్రాప్ నమోదు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ రబీ పంట కాలానికి సంబంధించి ఇప్పటివరకు 10500 ఎకరాలు వివిధ పంటలు సాగుచేసినట్లు తెలిపారు. వాటిలో 9450 ఎకరాలు మాత్రమే పంట నమోదు చేసుకున్నట్లు చెప్పారు. మిగిలిన వారు కూడా వెంటనే మీ రైతు భరోసా సిబ్బందిని కలిసి పంట నమోదు, రైతు ఈ-కేవైసీ పూర్తి చేయించుకోవాల్సిందిగా తెలిపారు. పంట నమోదు చేయించుకోవడం వలన ఉచిత పంటల బీమా, పంట నష్టపరిహారాలు తదితర ఉపయోగాలు లభిస్తున్నాయని వివరించారు.

శింగరకొండ దర్శిని



అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి మూలవిరాట్టు

అద్దంకి: శుభకృత్ నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం విశాఖ నక్షత్రం అష్టమి సందర్భంగా సోమవారం ప్రత్యేక పూజలు చేస్తారని శింగరకొండ దేవస్థాన ఏసీ సుభద్ర ఆదివారం తెలిపారు. ఉదయం 5గంటలకు సుప్రభాత సేవ, 5.30 గంటలకు బిందెతీర్థం. మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

ఉగాదికి గృహ ప్రవేశాలు చేయించాలి



బల్లికురవ: లక్ష్యాలపై సమీక్షిస్తున్న ఎంపీడీవో కృష్ణ



వేటపాలెం: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజ్ దెబోరా

వేటపాలెం: జగనన్న లే అవుట్‌లో నిర్మాణాలు జరుగుతున్న ఇళ్లు ఉగాదికి పూర్తి చేసి లబ్ధిదారుల చేత గృహ ప్రవేశాలు చేయించాలని మండల ప్రత్యేక అధికారి జే రాజ్‌దెబోరా ఆదేశించారు. మండల పరిషత్ సమావేశం హాల్లో గ్రామ సచివాలయాల ఇంజినీర్లు, హౌసింగ్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు జరుగుతున్నాయని తెలిపారు. వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అదే విధంగా కాలనీల్లో మౌలిక వసతులు వేగవంతగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శర్మ, ఏవో ఏ కాశీవిశ్వనాథ్, ఈవోఆర్‌డీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం జగనన్న కాలనీలు, సొంత స్థలాలకు మంజూరు చేసిన పక్కా ఇళ్ల లక్ష్యాలను మార్చి 20వ తేదీలోపు పూర్తి చేసి గృహ ప్రవేశాలు చేయించాలని ఎంపీడీవో సీహెచ్ కృష్ణ సెక్రటరీలను కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక పరిషత్ కార్యాలయంలో 20 సచివాలయాల్లోని సెక్రటరీలు, గృహనిర్మాణ సిబ్బంది, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలానికి 641 గృహాలు మంజూరవ్వగా 416 గ్రౌండింగ్ చేపట్టామని 176 మాత్రమే పూర్తయ్యాయని మిగిలినవి కూడా పూర్తి చేయాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణ శాఖ ఏఈ దుర్గా రమేష్, ఈవోఆర్డీ జీ. సీతామహాలక్ష్మి పాల్గొని మాట్లాడారు.

విద్యుత్ దీపాల కాంతుల్లో క్షీరపురి

- పట్టణ సుందరీకరణలో భాగంగా విద్యుత్ కాంతులు
- రూ.5 లక్షల వ్యయంతో రోప్ లైటింగ్‌లు ఏర్పాటు



ముంతావారిసెంటర్ వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ బోర్డు





ప్రధాన రహదారుల్లోని లైటింగ్ స్తంభాలకు వేసిన రోప్ లైటింగ్

చీరాల అర్బన్: సుందర చీరాలకు మరింత అందాన్ని తెచ్చేలా మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేసిన ప్రత్యేక విద్యుత్ దీపాలు మరింత అందాన్ని తెచ్చింది. పట్టణ సుందరీకరణలో భాగంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచేందుకు చీరాల మున్సిపాలిటీలోని విద్యుత్ స్తంభాలకు ఎల్ఈడీ రోప్‌లు ఏర్పాటు చేశారు. చీరాల మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులలోని విద్యుత్ స్థంభాలు ఉండగా వీటికి రంగు రంగుల రోప్ లైటింగ్‌లు ఏర్పాటు చేశారు. దీంతో రాత్రి వేళలో పట్టణం రంగురంగు విద్యుత్ దీపకాంతులతో మరింత శోభను తెచ్చింది. పట్టణంలో ఈపూరుపాలెం స్ట్రయిట్‌కట్ నుంచి, కారంచేడు ఎఫ్‌సీఐ గొడౌన్స్ నుంచి, బోస్‌నగర్ నుండి పట్టణంలోకి అన్ని ప్రధాన రహదారుల్లోని 180 విద్యుత్ స్తంభాలకు ఈ విధంగా రోప్ లైటింగ్‌ను మున్సిపల్ సాధారణ నిధుల నుంచి రూ.5 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేశారు. అలానే చీరాలలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు లైట్లు అమర్చడంతో రాత్రి వేళల్లో ఆయా ప్రాంతాలు దీప కాంతులు మిరుమిట్లుగొల్పుతున్నాయి. అలానే పట్టణంలోని ప్రధాన సెంటర్లలో ఆయా సెంటర్ల పేర్లు తెలిసేలా ఎల్ఈడీ బోర్డులను ఏర్పాటు చేశారు. ముంతావారిసెంటర్, గడియార స్థంబం సెంటర్, మసీదు సెంటర్, ముక్కోణం పార్కు సెంటర్లలో పెద్ద సైజు బోర్డులను ఏర్పాటు చేశారు. చీరాలకు కొత్తవారు వచ్చినా ఆయా సెంటర్లు తెలుసుకునేలా ఎల్ఈడీ బోర్డులను డివైడర్లపై ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రానికి దగ్గర ఉన్న చీరాల మున్సిపాలిటిని అభివృద్ధి చేసేందుకు, ప్రత్యేక ఆకర్షణగా నిలిపేందుకు వీటిని ఏర్పాటు చేశారు.

సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి..

చీరాల మున్సిపాలిటీలోని అన్ని ప్రధాన సెంటర్ల వద్ద ఉన్న విద్యుత్ స్తంభాలకు రోప్ లైటింగ్‌ను ఏర్పాటు చేశాం. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో రూ.5 లక్షల వ్యయంతో వీటిని ఏర్పాటు చేశాం. అలానే ప్రధాన సెంటర్ల సూచికగా పెద్ద సైజులో సెంటర్ల పేర్లను ఎల్ఈడీ లైట్లు బోర్డులను ఏర్పాటు చేశాం. చీరాల పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతాం.

– ఏసయ్య, మున్సిపల్ కమిషనర్

మందుబాబులకు అడ్డాగా రైల్వేస్టేషన్

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని పోలీసులు



రైల్వేస్టేషన్ ముందు ప్రాంగణలో మద్యం తాగుతున్న ఆకతాయిలు

వేటపాలెం: రైల్వేస్టేషన్ ప్రాంగణాన్ని మందుబాబులు తమ అడ్డాగా మార్చుకున్నారు. స్టేషన్ ముందుగల చెట్ల కిందనే నిత్యం మద్యం సేవిస్తున్నారు. ఉదయం, సాయంకాలం వేళల్లో స్టేషన్ ప్రాంగణలోని చెట్ల కింద మందుబాబులు మద్యం సీసాలు తెచ్చుకొని అక్కడే మద్యం తాగుతున్నారు. రైలు దిగి స్టేషన్ ముందుగా నడిచి వెళ్లే ప్రయాణికులను పలు ఇబ్బందులకు గురిచేస్తున్నారు. స్టేషన్ ముందు అసభ్య పదజాలంతో మందుబాబులు వీరంగం చేస్తూ దర్శనం ఇస్తుంటారు. స్టేషన్ ముందు రోడ్డులోనే యథేచ్ఛగా రాత్రి, ఉదయం వేళ్లలో ఇళ్లలో పెట్టి మద్యం విక్రయాలు జరుపుతున్నారు. రైల్వేస్టేషన్ రోడ్డులోనే పోలీస్ స్టేషన్ కూడా ఉంది. పోలీసుస్టేషన్‌కి 100 మీటర్ల దూరంలోనే ఇళ్లలో మద్యం నిల్వ విక్రయాలు జరుపుతున్నా పోలీసులు పట్టించుకున్న దాఖలాలు లేవని విమర్శిస్తున్నారు. మద్యం విక్రయ దారుల నుంచి మామూళ్ల వసూలు చేసుకొని పోలీసులు నిమ్మకు నీరేత్తినట్టు వ్యవరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు మద్యం విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకొవాలని కోరుతున్నారు. రైల్వేస్టేషన్ వద్ద మద్యం తాగే ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఆర్టీసీ స్థలాలకు డిపాజిట్లు చెల్లించాలి



టెండర్‌దారులతో మాట్లాడుతున్న డీఎం రామ్మోహన్‌రావు

బల్లికురవ: ఆర్టీసీ స్థలాలను సంబంధించి టెండర్లు దాఖలు చేసిన వారిలో 11 మందికి అనుమతి పొందారని 6 నెలల సొమ్ము డిపాజిట్‌గా చెల్లించాలని అద్దంకి డిపో మేనేజర్ బీ. రామ్మోహనరావు కోరారు. సోమవారం సాయంత్రం బల్లికురవ బస్టాండ్‌లో వ్యాపారులతో ఆయన మాట్లాడారు. ఇటీవల కాలంలో బల్లికురవలో రోడ్డు మార్జిన్‌లోని ఆక్రమణలో భాగంగా స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి మార్టూరు వైపు అద్దంకి వైపు 28 దుకాణాల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానించారు. వీరిలో 17 మంది తక్కువగా కొటేషన్ వేసినందు వలన ఆటెండర్లను రద్దుచేశారు. 11 మందిని డిపాజిట్ సొమ్ము చెల్లించాలని కోరంటంతో ఆర్టీసీ స్థలాన్ని బాగు చేయించి మార్కింగ్ ఇస్తేనే డిపాజిట్ సొమ్ము చెల్లిస్తామని, ఉన్నత అధికారులకు నివేదిస్తామని చెప్పారు.

ప్రతిభకు అనుగుణంగా బోధిస్తే ఫలితాలు



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న డిప్యూటీ విద్యాశాఖ అధికారి

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభాపాటవాలను గుర్తించి అనుగుణంగా ఉపాధ్యాయుల బోధిస్తే సత్ఫలితాలు రాబట్టొచ్చని పర్చూరు డిప్యూటీ విద్యాశాఖ అధికారి ఏ కిరణ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని ఆదిపూడి మెయిన్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు వారికి ఎలా బోధిస్తున్నారో దగ్గరుండి గమనించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ తరహా బోధనలు ప్రభుత్వ పాఠశాలల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. మౌలిక వసతులు, బ్యాగుల దగ్గర నుంచి పుస్తకాలు, మంచి పోషకాహారం ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందన్నారు. వీటన్నింటినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకుంటూ చక్కగా చదువుకొని మీ బంగారు భవిష్యత్‌ను తీర్చిదిద్దుకోవాలన్నారు. అనంతరం ఆయన మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు పరిశీలించారు. తప్పనిసరిగా మెనూ అమలు చెయ్యాలని ఆయన కుకింగ్ నిర్వాహకులకు సూచించారు. రేణుకాదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోపుడు బండ్ల పంపిణీ



తోపుడు బండ్లు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు

అద్దంకి: రోటరీ క్లబ్ ఆఫ్‌శింగరకొండ, హైదరాబాద్ డెక్కన్ రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో పేద వీధి వ్యాపారులకు రూ.1.50 లక్షలతో పది మందికి తోపుడు బండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమం రోటరీక్లబ్ ఆఫ్‌శింగరకొండ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు అధ్యక్షతన స్థానిక గీతా మందిరంలో సోమవారం నిర్వహించారు. కార్యక్రమానికి రోటరీ క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ గల్లా సాంబశివరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ పేద వ్యాపారులకు వీధుల్లో ఈ తోపుడు బండ్లను ఉపయోగించుకుని వ్యాపారంతో స్వయం సమృద్ధి సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శిచిన్ని మురళీకృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి, కొల్లపర నాగయ్య, వూటుకూరు రామకోటేశ్వరరావు, గురుశేఖర్, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కోడిగుడ్లు, పాలను దొంగిలించిన వాచ్‌మెన్



పట్టుకున్న గుడ్లు, పాలు

వేటపాలెం: విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం పథకం కింద చిక్కీతో భోజనం, కోడిగుడ్లు రోజూ అందిస్తున్నారు. అయితే విద్యార్థులకు అందించాల్సిన చిక్కీ, కోడిగుడ్లు, బియ్యం, కందిపప్పు స్కూల్ వాచ్‌మెన్ పక్కదారి పట్టిస్తున్న ఘటన సోమవారం వెలుగు చూసింది. వేటపాలెం రైల్వే స్టేషన్ రోడ్డులో గల జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల్లో 1100 మంది విద్యార్థులు చదువుకుటున్నారు. వీరికి ప్రభుత్వం మధ్యాహ్నం భోజనం పథకం కోసం నిత్యావసర వస్తువులు అందిస్తున్నారు. అయితే హైస్కూల్ వాచ్‌మెన్ కన్నయ్య గుట్టుచప్పుడు కాకుండా ప్రతిరోజు రాత్రి వేళల్లో హైస్కూల్ స్టోర్ రూమ్‌లోని కందిపప్పు, బియ్యం, చిక్కీ, కోడిగుడ్లను వారి బంధువులను పిలిపించి తరిస్తున్నాడు. ఇది గమనించిన హైస్కూల్ వద్దగల ప్రజలు విలేకర్లకు సమాచారం అందించగా అక్రమంగా సంచిలో ఉంచి తరలిస్తున్న 90 కోడి గుడ్లను పట్టుకొని పోలీస్‌లకు అప్పగించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు.

అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు



అల్లూరి జీవిత విశేషాలను తెలుపుతున్న ఉపాధ్యాయులు

చినగంజాం: అల్లూరి సీతారామరాజు చిరస్మరణీయుడు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇంకొల్లు మండలం పూసపాడు జెడ్పీ హైస్కూల్‌లో అల్లూరి సీతారామారాజు 150వ జయంతి పురస్కరించుకొని సోమవారం అల్లూరి జయహే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిలకలూరిపేట రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు స్వాతంత్ర్య సమరయోధులు, అల్లూరి సీతారామరాజు జీవిత విశేషాలను గురించి తెలిపారు. పూర్వ విద్యార్థి దండ లక్ష్మీనారాయణ పాఠశాల లైబ్రరీకి రూ. 5 వేలు విలువ చేసే పుస్తకాలు బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం కే శ్రీనివాసరావు, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, సీఆర్ కాలేజీ రిటైర్డ్ ప్రిన్సిపాల్ టీ వెంకటనారాయణ, పాఠశాల పూర్వ విద్యార్థి, రోటరీ క్లబ్ పూర్వ అధ్యక్షుడు, డీఆర్ఎం కాలేజీ రిటైర్డ్ లెక్చరర్ దండ లక్ష్మీనారాయణ, రిటైర్డ్ పీఈటీ పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణమే



కోటేశ్వరరావుని అభినందిస్తున్న పేరెంట్స్ కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు

కారంచేడు: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు బదిలీలు సర్వ సాధారణమేనని యూటీఎఫ్ మండల శాఖ గౌరవ అధ్యక్షుడు యూ భవానీప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణ వైసీ (యానాదికాలనీ) ప్రాథమిక పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై బదిలీ అయిన పారి కోటేశ్వరరావుకు గ్రామంలోని అన్ని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందన సభ నిర్వహించారు. స్కూల్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమానికి భవానీప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోటేశ్వరరావు ఇక్కడ పనిచేసినంత కాలంలో పాఠశాల అభివృద్ధికి, విద్యార్థుల అభ్యున్నతికి ఎంతో చిత్తశుద్ధితో పనిచేశారన్నారు. పాఠశాల విద్యాకమిటీ సభ్యులు శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో మార్తమ్మ, పీ భవానీ, శోభాదేవి పాల్గొన్నారు.

ర్యాపిడ్ కిట్లతో మలేరియా గుర్తింపు



కిట్లపై అవగాహన కల్పిస్తున్న శంకర్

కారంచేడు: గ్రామాల్లో జ్వరాలతో ఇబ్బందులు పడేవారికి ఏఎస్ఎంలు, వైద్య సిబ్బంది వారికి అందుబాటులో ఉంచిన ర్యాపిడ్ మలేరియా కిట్లను వినియోగించి పరీక్షలు నిర్వహించాల్సి ఉందని పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ షాలినీ అన్నారు. సోమవారం మండలంలోని స్వర్ణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో జిల్లా మలేరియా అధికారి సూచనల మేరకు ఏఎస్ఎంలు, ఆశలు, పీహెచ్‌సీ సిబ్బందికి ర్యాపిడ్ మలేరియా కిట్లు ద్వార రక్త పరీక్షలు ఎలా చేయాలో వివరించారు. గ్రామాల్లో చలిజ్వరంతో బాధపడుతున్న వారిని గుర్తించినప్పుడు వెంటనే ఈ కిట్‌ను ఉపయోగించి పరీక్షలు చేయాలన్నారు. కిట్లు పరీక్షలు నిర్వహించిన తరువాత కూడా వాటిని ఎలా బయో మెడికల్‌వేస్ట్ నిర్వహించాలి, పరీక్షల అలనంతరం వాటి ఫలితాలు ఎలా నిర్ధారించాలి వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రియ, హెల్త్ ఎడ్యుకేటర్ మీనాకుమారి, బయ్యా శంకర్, స్టాఫ్ నర్స్‌లు, ఏఎస్ఎంలు, ఆశలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సహకరించాలి



పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకటరెడ్డి

చినగంజాం: ఎన్నికల నియమావళి ప్రకారం నాయకులు అధికారులకు సహకరించాలని తహసీల్దార్ పీ బ్రహ్మయ్య సూచించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినందున తహసీల్దార్ కార్యాలయంలో అన్ని పార్టీల నాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో రాజకీయ నాయకుల బొమ్మలను మాస్కులతో కప్పి ఉంచాలని, పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలని వారు ఆదేశించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంతవరకు వ్యతిరేక కార్యకలాపాలను తలపెట్టకుండా రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో డీ విజయలక్ష్మి, ఎంఈఓ డీ గంగాధర్, వీఆర్వోలు, వైఎస్సార్ సీపీ, టీడీపీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ తనిఖీ..

యద్దనపూడి: త్వరలో జగరబోయే ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, శాసనమండలి ఎన్నికల నిర్వహణ ఏర్పాటులో భాగంగా పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసినట్లు తహసీల్దారు వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రం యద్దనపూడి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రాడ్యుయేట్ పోలింగ్‌బూత్ 108,టీచర్స్ పోలింగ్‌బూత్ 52 ఉన్నాయని తెలిపారు. ఈ తనిఖీల్లో పోలింగ్ సిబ్బంది బసచేసే గదులు , ఓటర్లు ఓటుహక్కు వినియోగించుకునేలా కనీస సౌకర్యాలు ఫర్నిచర్, లైటింగ్, తాగునీరు, టాయిలెట్లు, ఎలా ఉన్నాయో పరిశీలించారు. మండలంలో మొత్తం గ్రాడ్యుయేట్లు 781 మంది, టీచర్లు 27 మంది ఓటుహక్కు వినియోగించుకోనున్నట్లు తెలిపారు. ఆయన వెంట వీఆర్వో జ్యోతిరావు, కార్యాలయ సిబ్బంది సురేష్ ఉన్నారు.

మచ్చలపై అవగాహనతో కుష్టు గుర్తింపు



ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

అద్దంకి: మచ్చలపై అవగాహనతో కుష్టు వ్యాధిని తేలికగా గుర్తించవచ్చని మార్టూరు సెక్టార్ డిప్యూటీ పారామెడికల్ అధికారి ఎన్. శ్రీనివాసరావు అన్నారు. ఆరోగ్య సిబ్బంది, సింగరకొండపాలెం గిరిజన ప్రాంతాల్లో కుష్టువ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ చేతులపై మచ్చలు, ఏర్పడటం , కండరాల్లో, నరాల్లో తిమ్మురులు, కళ్లు మూసుకుపోవడం, చర్మం, చెవి తమ్మెలపై బుడిపెలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి నీలం రామకోటేశ్వరరావు, లెప్రసీ నోడల్ అధికారి అబ్దుల్ సత్తార్, ఆరోగ్య కార్యకర్తలు ఎస్ యేసమ్మ పాల్గొన్నారు.

350 మందికి వైద్య పరీక్షలు



రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చినగంజాం: మండలంలోని నాగండ్ల గ్రామంలో ఒంగోలు కిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో సోమవారం 350 మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ప్రాథమిక వైద్యులు నాగండ్ల శ్రీనివాసరావు, నాగండ్ల శివప్రసాద్ సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటికి సంబంధించిన పరీక్షలతో పాటు ఈసీజీ, షుగర్, బీపీ, గుండె, కిడ్నీ, విషజ్వరాలు వంటి వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరంలో వైద్యులు డాక్టర్ రామాంజనేయులు, డాక్టర్ సంపత్, రాణిలు వైద్యపరీక్షలు నిర్వహించగా హాస్పిటల్ సిబ్బంది, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్ రఫీ పాల్గొన్నారు.